

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


## కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి



కూరగాయల మార్కెట్‌ను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి

**వికారాబాద్,ఆగష్టు 27, ప్రభాతవార్త:** పట్టణంలోని కూరగాయల మార్కెట్, రైతు బజార్‌ను మంగళవారం వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి సందర్శించారు. రైతు బజార్ వెనకాల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు కొనసాగుతున్నందున కూరగాయలు అమ్ముకునే రైతులకు రైతు బజార్ లోపల స్థలం లేకపోవడంతో రోడ్డు మీదకు వచ్చి కూరగాయలు అమ్ముకుంటున్నారని, ఈ సమస్య పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ విషయమై రైతులకు తగిన పరిష్కారం చూపాలని స్పీకర్ కలెక్టర్‌కు సూచించడం జరిగిందని, ఈ మేరకు ట్రైనీ కలెక్టర్ కూరగాయల మార్కెట్‌ను సందర్శించారని చైర్‌పర్సన్ తెలిపారు. పట్టణంలోని రైతు బజార్ ను ట్రైనీ కలెక్టర్ సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను రైతుల ం అడిగి తెలుసుకున్నారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, చైర్ పర్సన్ మంజుల పాత కూరగాయల మార్కెట్‌ను సైతం సందర్శించారు. కూరగాయల మార్కెట్ మొత్తం బురద మయంగా మారిందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చైర్ పర్సన్ ట్రైనీ కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్ శ్రీదేవి, శానిటేషన్ ఇన్చార్జ్ ఎస్ఐ ఏసు, ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 29న కలెక్టరేట్‌లో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27, ప్రభాతవార్త :** ఈ నెల 29న మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జాబ్‌మేళా జరుగుతుందని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా కార్యాలయంలో 29న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఫ్లిప్‌కార్ట్ హైదరాబాద్ కంపెనీ వారు డెలివరీ ఎక్జ్యుక్యూటివ్ పోస్టులకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఏదైనా డిగ్రీ ఉన్నవారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. నగరంలోని గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, 15వేల రూపాయల వేతనం, వసతి, పిఎఫ్, హాస్టల్‌ఫుడ్, బైక్ సౌకర్యం కంపెనీ కల్పిస్తుందన్నారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి ఉన్న జిల్లా కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 9866465024, 7386809422 ఫోన్‌నెంబర్లలో సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

## బిజెపి మైత్రితోనే ఎమ్మెల్సీకవితకు బెయిల్

**-సిఎం రేవంత్ రెడ్డి చెప్పిన నాటి వాస్తవాలను గుర్తుచేసిన కేఎల్ఆర్**

**-భవిష్యత్తులో బిజెపి, బిఆర్ఎస్ కూటమిగా ఎన్నికల్లో పోటీ**

**మహేశ్వరం, ఆగస్టు 27, ప్రభాతవార్త :** భవిష్యత్తులో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటిగా పోటీ చేసి కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం అవుతున్నాయని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కూతురు కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై తీవ్ర స్థాయిలో కేఎల్ఆర్ ధ్వజమెత్తారు. లిక్కర్ అవినీతిని సమర్థంగా వాదించే సమర్థత ఈడీ, సీబీఐకి బీజేపీ కేంద్ర సర్కారు ఇవ్వలేదన్న విషయాన్ని తెలంగాణ ప్రజలు గమనించాలని ఆయన కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్ని రాష్ట్రాల ప్రభుత్వాధినేతల అవినీతిపై ఎంక్వయిరీ జరుగుతుందని లక్ష్మారెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ అవినీతిలో బీజేపీకి భాగ స్వామ్యం ఉందని ఆరోపించారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలి

**-వైద్యాధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ శశాంక**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు, జ్వరాల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శశాంక వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లోని ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ శశాంక ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రిని వైద్య సిబ్బందితో పాటు పేషెంట్లకు సంబంధించిన వార్డులను పరిశీలించారు. ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకి ఆసుపత్రులకు వచ్చిన వారికి సరైన వైద్యం అందించాలని, ఏరియా ఆసుపత్రి పరిధిలోని ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు సగటున ఎంతమంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. వారిలో ఎంతమంది ఇన్ పేషెంట్లుగా అడ్మిట్ అవుతున్నారని, డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలతో ఎంతమంది ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారనే వివరాలను డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటున్న రోగులను పలకరించి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం ఎక్కడెక్కడి నుండి ప్రజలు వస్తారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన వారికి సరైన వైద్యం అందించాలని, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. టెస్టులు నిర్వహించి వివరాలు రిజిస్టరులో నమోదు చేయాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికి రక్త నమూనాల సేకరణ, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి డెంగ్యూ, మలేరియా, వీరల్ ఫీవర్, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ తనిఖీలో డాక్టర్ జి. రాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ జి. అనురాగిణి రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకృష్ణ, ఆర్ఎంఓ డాక్టర్ సుధాకర్, సీఎస్ జనరల్ మెడికల్ హేమలత, న్యూరో సూరింటెండెంట్ హెప్సిభా, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ అపర్ణ, టి.హబ్ ఇంచార్జి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక



రోగిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శశాంక

## ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి

**-సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్**

**-ఎన్నికల్లో హామీలు ఇచ్చిన విధంగా రైతులకు న్యాయం చేయాలి**

**-మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఐ,ఎఐఎస్‌కె రైతు సంఘం ధర్నా**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్త శుద్ధి ఉంటే ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన విధంగ ఎలాంటి షరతులు లేకుండ 2లక్షల రుణమాఫీ అమలు చేయాలని, ఎంతో మంది రైతులు రుణమాఫీ అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని ఆ విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం కొనసాగితే మాత్రం రైతుల పక్షాన సిపిఐ పోరాటాలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. పట్టాదారు పాసుబుక్స్ కూడ ధరణిలోని లోపాలతో ఇబ్బందులు తప్పటం లేదని, లోపాలను సరిచేసి భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బాలమల్లేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఎఐఎస్‌కె తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగ పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పటంతో రైతాంగం ఆశలతో ఉన్నారన్నారు. రైతులకు 2లక్షల రుణమాఫీ చాలా మందికి అందలేదని, జిల్లా, మండల అధికారుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందని అన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి రుణమాఫీని అమలు చేయాలన్నారు. ప్రజా సమస్యలపై, రైతుల సమస్యలపై రైతు సంఘం, సిపిఐ పోరాటాలు చేస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవరిస్తే ప్రభుత్వంతో పొత్తు ఉన్నప్పటికీ సిపిఐ ప్రజల, రైతుల పక్షాన ఉద్యమాలు, పోరాటాలు చేస్తుందని అన్నారు. ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అమలు చేయాలని ఎన్.బాలమల్లేశ్ డిమాండ్ చేశారు. రైతులకు రుణ మాఫీ చేయాలని, పేదలకు ఇళ్లస్థలాలు,పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా రైతుసంఘం గౌరవాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి సిహెచ్.దశరథ, శ్యామలవెంకట్‌రెడ్డిలు మాట్లాడుతూ రైతులకు భేషరతుగా 2లక్షల రుణమాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు సిపిఐ రైతు సంఘం అండగ ఉంటుందన్నారు. జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ శామీర్‌పేటలోని సర్వేనెంబరు 1266లో సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాదారుపాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. బొమ్మరాసిపేట్, చీర్యాల గ్రామాల రైతులకు పట్టాదారు పాసుబుక్స్ ఇవ్వాలన్నారు. రైతురుణమాఫీ అమలు చేయాలన్నారు. శామీర్‌పేటలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేయాలని ఆయన సూచించారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు సిపిఐ నాయకులు, రైతు నాయకులు మెమోరాండంను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు చంద్రయ్య, కనకయ్య, బాలయ్య, శంకర్, మండలాల సిపిఐ కార్యదర్శిలు డిజి నరేంద్ర ప్రసాద్, టి.రాములుగౌడ్, సహదేవ్, టి.యాదయ్యగౌడ్, ఎన్.కృష్ణ, మహిళా నాయకురాలు ఎం.రాజేశ్వరి, నాయకులు నరేంద్రచారి, చీర్ల సత్తయ్య, ఆంజనేయులు, కమలమ్మ, కౌసల్య, వెంకటేశ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్,పాల్గొన్న జిల్లా కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, జిల్లా రైతుసంఘం అధ్యక్షులు దశరథ, పలువురు నాయకులు

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



బాధిత కుటుంబానికి సిఎంరిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి,పాల్గొన్న నాయకులు మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లాలయ్య, తదితరులు

**శామీర్‌పేట, ఆగస్టు 27, ప్రభాతవార్త**

మజీద్‌పూర్ గ్రామానికి చెందిన ఎ.సత్యనారాయణకు ఆరోగ్య వైద్యపరీక్షల కోసం సిఎం రిలీఫ్‌ఫండ్ ఆర్థిక సహాయం 51వేల రూపాయలు మంజూరు కావటంతో ఆ చెక్కును మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి బాధితులకు అందజేశారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని మజీద్‌పూర్ గ్రామానికి చెందిన ఎ.సత్యనారాయణ కు ఆరోగ్య సేవలు పొందటానికి ప్రభుత్వం 51వేల రూపాయలు మంజూరు చేసినట్లు, బాధితులకు ఆర్థిక సహాయం చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి, ఎం.లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.


### వ్యవసాయ పొలంలో అనుమానాస్పద గుంత



పూడూరు మండల ఎన్కెపల్లి గ్రామానికి చెందిన పొలంలో అనుమానాస్పదంగా తవ్వి‌ఉన్న గుంత

**పూడూరు, ఆగష్టు 27, ప్రభాతవార్త :** గుర్తుతెలియని దుండగులు ఓ వ్యవసాయ పొలంలో గుంతత్రవ్వి వదిలి వేయడంతో పలు అనుమానాలకు దారితీస్తోంది. గ్రామస్తుల కథనం ప్రకారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామనికి చెందిన మాజీ సర్పంచ్ దయాకర్‌కు చెందిన సర్వేనెంబరు 130లోని వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి గోతితీశారు. గోతిలో నిమ్మకాయలు, చుట్టు ప్రక్కల వాటర్‌బాటిళ్లు, పసుపు ప్యాకెట్టు, నల్లటి ఫాల్తిన్ కవర్ వంటివి వదిలి వెళ్లారు. అయితే పొలం యజమాని సోమవారం పొలాన్ని చూసేందుకు వెళ్లగా గోతి కనిపించింది. దీంతో తనకు తెలియకుండ ఇక్కడ గోతిని ఎవరు తీశారని అనుమానం వ్యక్తంచేస్తూ ఈ విషయాన్ని గ్రామస్తులకు వివరించి మరోమారు పరిశీలించారు. దీంతో ఇక్కడ గుప్తనిధులకోసం గోతి తీశారా?లేక మరేదానికోసమైన గోతితీశారా? అన్న అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ మధుసూధన్‌రెడ్డిని వివరణకోరగా తమకు ఎలాంటి పిర్యాదు అందలేదని తెలిపారు.

### ఆర్ఓబీ పనులు త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలి



ఆర్‌ఓబీ పిల్లర్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్, ఈఈ శ్రీనివాస్‌మూర్తి

**ఘట్‌కేసర్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెన పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ సూచించారు. రైల్వేగేటు ఎదురుగా పిల్లర్ గుంత తీయగా బుధవారం స్టీల్ ఫుట్టింగ్ సివిల్ వర్క్ చేపట్టనుండటంతో ఆర్‌అండ్‌బి అధికారులతో కలిసి ఆమె పనులను పరిశీలించి నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. గేటు అవతల వైపు పిల్లర్ల శ్లాబ్ నిర్మాణం పూర్తి కాగా గేటు ఇవతల వైపు పిల్లర్ల నిర్మాణం చేపట్టగా ముఖ్యమైన పిల్లర్ ఫుట్టింగ్ నిర్మాణం చేసేందుకు అవసరమైన సీకులు, కాంక్రీట్ సిద్ధం చేస్తున్నారు. రోడ్లు, భవనాల శాఖ ఈఈ శ్రీనివాస్‌మూర్తి, ఏఈలు రంజిత్, విద్యుత్ ఏఇ సతీష్‌కుమార్, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, ఈడబ్ల్యుఎస్‌కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, పి.శశిధరన్, శివరాత్రి సురేశ్, జహంగీర్, సిబ్బంది పాల్గొన్నారు.

### నాలాను అక్రమించి అక్రమ నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదు



మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్ర ం అందజేస్తున్న శ్రీనిధి, మారుతీనగర్ కాలనీల నాయకులు

**ఘట్‌కేసర్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడ మారుతీనగర్ ఈద్గా వద్ద నాలాను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు మంగళవారం మున్సిపల్ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. మారుతీనగర్, శ్రీనిధి కాలనీ వాసులు మున్సిపల్ కార్యాలయంలో అధికారిని కలిసి ఈద్గా వద్ద బైపాస్ రహదారి సర్వీస్‌రోడ్డులో ఉన్న నాలాలో జేసీబీతో మట్టిని నింపి చదును చేసి ఆక్రమంగా కట్టడాలు చేయడానికి పనులు చేయిస్తున్నారని తెలిపారు. నాలాను మూసివేస్తే కాలనీల నుంచి వచ్చే వరద నీటికి ఆటంకం కల్గి ప్రజాలకు ఇబ్బందులు వచ్చే ఆస్కారముందని విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని మారుతీనగర్‌కాలనీ, శ్రీనిధికాలనీ అధ్యక్షులు యరుకల రమేశ్‌గౌడ్, గడీల సంజీవరెడ్డి, సభ్యులు కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, నర్సింహ్మారెడ్డి, సత్యనారాయణ, అశోక్, మల్లయ్య, వెంకటేశ్, ఎలిమినేటి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, సుదర్శన్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిషేదిత గుట్కాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

**-పెద్దేముల్ ఎస్ఐ గిరి**



పోలీసులు స్వాదీనం చేసుకున్న గుట్కాలు

**పెద్దేముల్, ఆగస్టు 27, ప్రభాతవార్త:**

ప్రభుత్వ నిషేదిత గుట్కాలు విక్రయిస్తే చర్యలు తప్పవని పెద్దేముల్ ఎస్ఐ గిరి హెచ్చరించారు. ఎస్ఐ గిరితెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం పెద్దేముల్ మండలంలోని గోపాల్‌పూర్ బస్టాండ్ దగ్గర ఓ వ్యక్తి అనుమానస్పదంగా సంచులతో కనబడగాఅతని విచారించగా పెద్దేముల్ గ్రామానికి చెందిన బోయిని శ్రీకాంత్ అని తెలిసింది. అతని వద్ద తనిఖీ చేయగా సుమారు 11360 గుట్కాలు లభించాయి.వాటి విలువ సుమారు రూ. 28620 ఉంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిషేదించిన గుట్కాలను కర్ణాటక రాష్ట్రం కుంచారం గ్రామంనుంచి తరలిస్తుండగా పోలీసు సిబ్బందితో పట్టుకున్నట్లు తెలిపారు. ఇట్టి గుట్కాలను స్వాదీనం చేసుకొని సంబందిత వ్యక్తిపై కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

### అదుపులోకి తీసుకున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి

**ఆదిభట్ల ఆగస్టు27,ప్రభాతవార్త :** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కురుమలగూడలో అనుమానాస్పదంగా తిరుగుతు న్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, పోలిస్ స్టేషన్‌కు తరలిస్తుండగా ఒక వ్యక్తి గుండెపోటుతో మర ణించిన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్లఓ చోటుచేసుకుంది. ఆదిభట్ల సిఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్ స్టేషన్ పరిధిలోని కురుమలగూడ గ్రామంలో ముగ్గురు అనుమానితులు సంచరిస్తున్నట్లు గ్రామానికి చెందిన బద్రమోని మధు 100కు ఫోన్ చేయగా పోలీసులు అక్కడికి చేరుకొని ముగ్గురు అనుమానుతులను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గు రు అనుమానితులు ఎండి హాజీ,రత్నావత్ గోవింద్,నేనావత్ నరేష్‌గా గుర్తించారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని అదుపు లోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా హాజీ అనే వ్యక్తికి గుండె నొప్పి రావడంతో తుర్కయం జాల్‌లోనే మహానియా ఆసత్రికి తరలించారు,అప్పటికి అతడు గుండెపోటుతో మరణించినట్లు తెలిపారు.వారి మరణానికి వారి పట్ల పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని ఆదిభట్ల సిఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.

### అప్పుల భాదతో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**శామీర్‌పేట, ఆగస్టు 27, ప్రభాతవార్త**

తుర్కపల్లి గ్రామంలో నివాసం ఉంటూ వ్యాపారం చేసుకుంటున్న ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అప్పుల బాద తాళలేక ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు స్పష్టం అవుతుంది. శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. జీనోమ్‌వ్యాలీ పోలీసుల కథనం ప్రకారం తుర్కపల్లి గ్రామంలో రాజస్థాన్‌కు చెందిన రాకేశ్‌సిర్వి కిరణాషాపును నడుపుతూ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలనే వ్యాపారంలో నష్టం వాటిల్లటంతో అప్పుల భాదతో మంగళవారం ఉదయం తుర్కపల్లిలోని ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అనురాగ్ అక్రమణలపై ఏఐఎస్ఎఫ్ ధర్నా..అరెస్ట్



అనురాగ్ కళాశాల ముందు ధర్నా చేస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు



**ఘట్‌కేసర్, ఆగష్టు 27, ప్రభాతవార్త:** చెరువు బఫర్‌జోన్‌లో బహుళ అంతస్తుల భవనాలు చేపట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న అనురాగ్ విద్యాసంస్థలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్దంగా చెరువు, నాలాలు అక్రమించి అనురాగ్ విద్యాసంస్థల యాజమాన్యం భనాలను నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ కళాశాల ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జోడిమెట్ల నుంచి కళాశాల గేటు వరకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిపి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పోచారం ఐటీసీ ఇన్‌స్పెక్టర్ బి.రాజువర్మ ఆదేశాల మేరకు పోలీసులు చేరుకొని కళాశాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. బఫర్‌జోన్‌లో నిర్మించిన భవనాలపై చర్యలు తీసుకోవాలంటూ ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఎస్ఐలు బి.నాగార్జునరెడ్డి, శివకృష్ణలు సిబ్బందితో ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ పదవిని అడ్డుపెట్టుకొని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇష్టారాజ్యంగా బఫర్‌జోన్‌లో భవనాలు నిర్మించి ఆరోపించారు. హైడ్రా అధికారులు విచారణ జరిపి బఫర్‌జోన్‌లో నిర్మించిన భవనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండి. అన్వర్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు హరీష్, అరుణ్, మహేశ్, వినయ్, సాయి. ఉపేందర్, భానుప్రకాష్, వినోద్, కార్తీక్, శివ, తేజ తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

**-రూ. వేయి జరిమానా**

**-జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి**

**యాలాల ఆగష్టు 27,ప్రభాతవార్త :**

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ,హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదు,రూ. వెయ్యి జరిమానా విధించబడింది.మంగళవారం ఎల్బీనగర్ న్యాయస్థానం స్పెషల్ సెషన్ నాయమూర్తి ఎం.భవానీ నిందితునికి శిక్ష విధించారు.2015 సంవత్సరంలో ఈ కేసునకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన దళిత కులానికి చెందిన నింగగాళ్ల అంబరప్ప అదే గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ ఇద్దరూ మంచి మిత్రులు.ఇద్దరూ కలిసి కూలీపని చేసుకుంటూ కలిసిమెలిసి ఉండేవారు.అయితే షేక్ మహబూబ్ భార్యకు అంబరప్పకు మధ్య అక్రమ సంబంధం ఉందనే అనుమానం పెనుభూతమైంది.దీంతో కక్ష్య పెంచుకున్న షేక్‌మహబూబ్ తన కుటుంబ సభ్యులతో కలిసి అంబరప్పపై పగతీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు.తేదీ15 జూన్ 2015లో అంబరప్ప కోడలు,కుమారుడు నవీన్ అనే బాలుడు గ్రామంలో కల్లు దుకాణానికి వెళ్లి కల్లు తీసుకొని ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో అడ్డగించిన షేక్ మహబూబ్ వారిపై దాడి చేశాడు.కులం పేరుతో దూషించడమే కాకుండా తన వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్‌పై దాడి చేశాడు.ఈ దాడిలో నవీన్ అనే బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి.ఈ క్రమంలో తన కుటింభికులను కులం పేరుతో దూషించి కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని అంబరప్ప యాలాల పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు అప్పట్లో తాండూరు డిఎస్పీగా ఉన్న లక్ష్మీనారాయణ దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టులో హాజరు పరచారు.కేసును త్వరిత గతిని కోర్టు ముందు ఉంచిడంలో ప్రస్తుత డిఎస్పీ బాలకృష్ణరెడ్డి కృషిచేశారని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి వెల్లడించారు.కేసు వాదోపవాదనలువిన్న రంగారెడ్డి కోర్టు స్పెషల్ సెషన్ న్యాయమూర్తి ఎం. భవానీ మంగళవారం నిందితుడైన షేక్ మహబూబ్‌కు జీవిత ఖైదు,రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

# టిటిడి దేవాలయంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**సైఫాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి) శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీకృష్ణ భగవానునికి అభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామికి అస్థానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామికి 12 రకాల ప్రసాదాలు తయారు చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో దేవాలయం కిటకిటలాడింది. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 12 రకాల ప్రసాదాల వితరణ జరిగింది. దేవాలయం ఉద్యోగులు మణికంఠ, లక్ష్మిపతి, ప్రభు తదితరులు భక్తులకు సేవలు అందించారు.


శ్రీకృష్ణాష్టమి సందర్భంగా కొలువుదీరిన శ్రీకృష్ణ భగవానుడు

## ప్రజల ఆరోగ్యం కోసం సమర్ధవంతమైన స్వచ్ఛత

**...డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి**

**తార్నాక, ఆగస్టు 27 ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్యం కోసం సమర్ధవంతమైన స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టాలని అధికారులను నగర డిప్యూటీ మేయర్ ఆదేశించారు. టీటీయూ సీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి, డిప్యూటీ కమీషనర్ సుభాష్ మంగళవారం ఇతర అధికారులతో కలిసి లాలాపేట్ ఇసుకబావి, పెద్దనాల తధితర ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలా పారుశుద్ధ పనులను వారు పరిశీలించారు. పరిసరరాల శుభ్రతపై డిప్యూటీ మేయర్ స్థానికులకు అవగాహణ కల్పించా రు. అదేవిదంగా తార్నాక, లాలాపేట్ ప్రధాన రోడ్లకు ఇరువైపుల కొందరు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పాదాచారులకు తీక్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆక్రమంగా వెలసిన వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటేష్, రాంకీ దశరత్, ప్రసన్న, నాయకులు ప్రవీణ్, షేక్ మక్బూల్, సుభాన్, శ్రీనివాస్ తధితరులు పాల్గొన్నారు.

## ప్రమాదం జరిగితే తప్పా స్పందించరా?

**అత్తాపూర్ ఆగస్టు27, ప్రభాతవార్త :** శివరాంపల్లి ప్రశాంత్ కాలనీ లో విద్యుత్ స్తంబాలు శిథిలావస్థకు చేరి ప్రమాదాలను పొంచి ఉన్న విద్యుత్ శాఖ, జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ఐదు రోజుల క్రితం ఈ స్తంభాలకు అనుకొని ఉన్న ఎండిన చెట్టును డిసిఎం ఢీకొనడం తో ఆ చెట్టు పూర్తిగా స్తంభంకు ఉన్న తీగలపై పడటంతో మరింత ప్రమాదానినన పొంచి ఉంది. ఈ మార్గంలో నిత్యం వాహనాలు, పాఠశాలలో రాకపోకలు సాగిస్తుండటంతో ఇప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. పాడైన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన అధికారులు పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. అధికారుల తీరు చూస్తుంటే ప్రమాదం జరిగితే తప్ప పట్టించుకోము అన్నట్లుగా అనిపిస్తుంది. అసలే వర్షాకాలం కావడంతో ఏ క్షణం ప్రమాదం సంభవిస్తోందనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కైనా అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# 800 మంది రోగులకు ముగ్గురు వైద్యులు

**-ఫీవర్ ఆస్పత్రిలో వైద్యుల, నర్సుల కొరత**

**-నిరుపేదలకు వైద్య సేవలు అంతంత మాత్రమే**

**-నగారానికి చెందిన వైద్యుల బదిలీలతో రోగులకు తప్పని తిప్పలు**


ఫీవర్ ఆస్పత్రిలో వైద్యులు లేక రోగుల పడిగాపులు



**హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్తః** నగరంలో డెంగ్యూ, విషజ్వరాలు విజృంభించాయి. ప్రభుత్వ ఆసుపత్రులు రోగులతో కిక్కిరిసిఉంటున్నాయి. జ్వరం వచ్చిందంటే ముందు గుర్తుకు వచ్చే ఫీవర్ ఆస్పత్రుల్లో వైద్యులు లేక రోగులు తల్లడిల్లిపోతున్నాయి. ప్రతి రోజు ఈ ఆస్పత్రికి సుమారు 800 మంది ఔట్‌పేషంట్లుగా వస్తున్నారు. వీరే కాకుండా కుక్కకాటుతో ప్రతి రోజు 70-100 మంది బాధితులు వస్తున్నారు. అయితే ఇక్కడ కేవలం ముగ్గురు వైద్యులు మాత్రమే సేవలు అందిస్తున్నారు. ఫివర్ ఆస్పత్రిలో వైద్యుల కొరత కారణంగా రోగులు నానా అవస్థలు పడుతున్నారు. సకాలంలో వైద్యసేవలు అందక నరకయాతన అనుభవిస్తున్నారు. దీనికి తోడు నర్సింగ్ స్టాఫ్ కూడా లేకపోవడం వల్ల రోగుల అవస్థలు అన్నిఇన్నికావు. కొన్ని రోజులకిందట జరిగిన బదిలీలలో భాగంగా ఫివర్ ఆస్పత్రి నుండి దాదాపు ఇక్కడ 12 మంది వైద్యులు ఉండగా 9మంది బదిలీపై వెళ్ళినట్లు సమాచారం. కాగా ఇప్పుడు కేవలం ముగ్గురు వైద్యులు మాత్రమే ఉన్నారు. నర్సింగ్ స్టాఫ్ కూడా గతంలో 49 మంది ఉండేవారు. ఇప్పుడు 21 మంది తగ్గిపోయి కేవలం 28 మంది నర్సులు మాత్రమే ఉన్నారు. గతంలో వార్డుకు ఇద్దరు, ముగ్గురు నర్సులు విధులు నిర్వహించేవారు. కాగా ఇప్పుడు ఒక్కో నర్సు రెండేసి వార్డులలో సేవలు అందించాల్సి వస్తోంది. ల్యాబ్ సిబ్బంది కూడా సరిపడా లేకపోవడంతో రోగులకు అన్ని రకాల సేవలు సకాలంలో అందుబాటులోకి రావడం లేదు. డెంగ్యూ వ్యాధిగ్రస్తులు పెరిగిపోవడంతో ప్రతిరోజు దాదాపు వెయ్యి మంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. వీరందరికి సేవలు సేవలు అందించడానికి సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. పనిఒత్తిడితో వైద్యులు, వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పరిస్థితి ఒక్క ఫీవర్ ఆస్పత్రిలోనే కాదు. నగరానికి చెందిన ఎంతో మంది వైద్యులను బదిలీ చేసిన వైద్యశాఖలో అంతే అనుభవజ్ఞు లైన వైద్యులను నియమించలేకపోవడం వల్ల పలు ఆస్పత్రులలో వైద్య సేవలు కొరవడుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా అనుభవజ్ఞులైన వై ద్యులను చిన్నచిన్న ఆస్పత్రులకు కబదిలీ చేయడంతో సమస్యలు ఎర్పడుతున్నట్లు తెలుస్తోంది.

వైద్యులను నియామకాల్లో స్పష్టత లోపించినట్లు తెలుస్తోంది. దీంతో పేదలకు అందే వైద్యం పట్ల నిస్సాయత నెలకొన్నట్లు తెలుస్తోంది. డీఎంఈ పరిధి హైదరాబాద్ నుంచి దాదాపు 135 మంది నుంచి 140 మంది వరకు ప్రొఫెసర్‌లను బదిలీ చేశారు. ఇందులో ప్రధానమైన ఉస్మానియా, గాంధీ, ఫీవర్, నిలోఫర్ ఆస్పత్రులకు చెందిన వారు ఉన్నారు. వీరి స్థానంలో చాలా వరకు ఎవరి నియామకాలు పూర్తిస్థాయిలో జరుగలేదు. గాంధీ ఆసుపత్రి, గాంధీ మెడికల్ కాలేజీ, ఉస్మానియా ఆసుపత్రి, ఉస్మానియా మెడికల్ కాలేజీ, నిలోఫర్ ఆసుపత్రి, ఎంఎన్‌జే క్యాన్సర్ సెంటర్‌లోని పలు విభాగాలకు చెందిన ప్రొఫెసర్‌లు అసోసియేట్ ప్రొఫెసర్‌లు బదిలి అయ్యారు. వారిస్థానంలో ఇతరులను నియమించారు. ఆరు సంవత్సరాల కిందట బదిలీలు జరిపే క్రమంలో ఒకేచోట పనిచేసే వారికి 20శాతం బదిలీ చేయాలనే నిబంధనలు విధించారు. అంతే కాకుండా బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారితో కలిసి దాదాపు 40 శతం మంది బదిలీలు జరిగాయి. అలాగే తాజా నిబంధనల ప్రకారం ఒకేచోట 4సంవత్సరాలు పూర్తి చేసుకున్నవారి జాబితాను సిద్ధం చేసి మొదటి నుంచి వరుస క్రమంలో ఉన్నవారిని 40శాతం మందిని బదిలీ చేయడానికి నిర్ణయించారు. ప్రభుత్వ సీలింగ్ ప్రకారం పూర్తయినట్లుగా భావించవచ్చు. దీంతో బదిలికోసం అర్జీలు పెట్టుకున్నవారిని బదిలి చేయడానికి లేకుండా పోయింది. మొత్తం 40 శాతంలోనే దరఖాస్తులు చేసుకున్న వారిని కూడా పరిగణలోకి తీసుకుంటే బావుండేదని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. అయితే అనుభజ్ఞులైన వైద్యలు బదిలీఅయిన చోట చాలావరకు ఆయా విభాగాలు పూర్తిగా సిద్ధం కాలేదని తెలిసింది. అలాగే అవసరమైన చోట మాత్రం అనుభవజ్ఞులైన వైద్యులు లేకపోవడంతో వైద్య సేవలు కుంటుపడే పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా గాంధీ, నిలోఫర్, ఫివర్, ఎంఎన్‌జే, ఉస్మానియా మరికొన్ని ఆసుపత్రుల కాలేజీల నుంచి పెద్దసంఖ్యలో బదిలీ జరుగడం వల్ల వైద్య సేవలపై తీవ్ర ప్రభావం నెలకొంది. ఇప్పటికే గాంధీ ఆసుపత్రిలో ప్రసవాలు తగ్గుముఖం పట్టాయని, వీటిని పెంచాల్సి న ఆవశ్యకత ఏర్పడిదని తెలుస్తోంది. డీఎంఈ పరిధిలో దాదాపు 2వందల మంది ప్రొఫెసర్‌లు ట్రాన్స్ ఫర్ కాగా వీరిలో 135 మంది హైదరాబాద్‌కు చెందినవారే. ఇందులో ఎంఎన్‌జే, ఉస్మానియా, గాంధీ, నిలోఫర్‌కు చెందివారే. అయితే ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే వైద్యుల సంఖ్య కనీసం 30 మంది కూడా లేరని సమాచారం. దీంతో నగరంలో వైద్య సేవలు కుంటుపడే పరిస్థితులు ఏర్పడతాయని తెలుస్తోంది.

# చంద్రబాబు ఎక్స్.ఓ పుస్తకావిష్కరణ..

**-పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవాని ప్రసాద్**



**పంజగుట్ట, ఆగస్టు 27 (ప్రభతవార్త):** ప్రపంచంలో అన్ని విషయాల మీద అవగాహన ఉన్న అనుభవజ్ఞులు చంద్రబాబునాయుడు అని మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్ వ్యాఖ్యానించారు. చంద్రబాబె ఎక్స్.ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతికి, తెలుగునేలకు ఏం చేయాలనే తపన ఉన్న వ్యక్తి చంద్రబాబు అన్నారు. చంద్రబాబునాయుడు భావాలు ఎపుడూ ఆదర్శంగానే ఉంటాయని, న్యాయ రంగం పట్ల ఆయనకు అపారమైన గౌరవ మర్యాదలు ఉన్నాయని ఆయన వివరించారు. ఏ వ్యవస్థ అయితే సామాన్యుడికి ఉపయోగపడుతుందో అని నిరంతరం ఆలోచించే వ్యక్తి చంద్రబాబు నాయుడు అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో ఎలా ఉండాలనే విషయంలో అందరికీ ఆదర్శంగా పాలన చేశారని కొనియాడారు. కార్యక్రమానికి తెలుగుదేశం రాష్ట్ర నాయకురాలు భవనం షకీలారెడ్డి అధ్యక్షత వహించారు. ఆంధ్ర రాష్ట్ర పరిస్థితి అతలాకుతలంగా ఉన్నా వెరవక ఐదున్నర కోట్ల ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న విజనరీ లీడర్ చంద్రబాబునాయుడుఅని మదనపల్లి శాసనసభ్యుడుమహ్మద్ షాజహాన్ భాషా వ్యాఖ్యానించారు. ఆంధ్రరాష్ట్రంలో వనరులు పూర్తిగా అడుగంటిపోయిప్పటికీ ఆర్థికంగా పరిపుష్టి తెచ్చేందుకు చంద్రబాబునాయుడు కృషి చేసునతన్నారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ చంద్రబాబు పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేశారు. స్త్రీలు ముందుకు తీసుకెళ్ళిన రోజునే ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని నమ్మిన సంస్కరణ వాది చంద్రబాబునాయుడు అని ఆమె కొనియాడారు. గ్లోబలైజేషన్‌ను మనముందు పెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. సంగీత విద్వాంసుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎపుడూ సంపూర్ణ చంద్రుడే అన్నారు. ప్రజల కోసమే బ్రదుకుదామని వచ్చి ప్రజలకోసం బ్రతుకుతున్న మహానుభావుడు చంద్రబాబునాయుడు అని కొనియాడారు. అధికారంలో ఉన్నపుడు మానవత్వంతో ఆలోచించే నేత చంద్రబాబు అన్నారు. తెలుగు రాష్ట్రాలకు రాజకీయాలకతీతంగా ఆయన ఒక ఐకాన్‌గా అభివర్ణించారు. ఏపీ రెరా మాజీ చైర్మన్ డాక్టర్ రామనాథ్ మాట్లాడుతూ బాబు ఆలోచనలు భావితరాల భవిష్యత్‌కు ముందుచూపుగా ఉంటాయన్నారు. దేశానికి చంద్రబాబు ఆలోచనా విధానం అవసరం అందుకే ఈ పుస్తకాన్ని అన్ని భాషల్లో అనువాదం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పుస్తక రచయిత శాఖమూరి శ్రీనివాసరావు, పబ్లిషర్ శ్రీకాంత్, బీఎన్‌రెడ్డి, యర్రవరపు రమణ, ఎల్లబోయిన శివరామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత, పబ్లిషర్‌లను రాష్ట్ర తెదేపా నేత భవనం షకీలా రెడ్డి అభినందించి, చంద్రబాబు నాయుడు తెలుగుజాతికి చేసిన సేవలను శ్లాఘించారు.

# భూలక్ష్మి దేవాలయంలో విగ్రహాల ధ్వంసం

## -బిజెపి నాయకుల నిరసన

**సైదాబాద్. ఆగస్టు 27 ప్రభాతవార్త:** సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రక్షాపురం కాలనీలో ఉన్న భూలక్ష్మి దేవాలయంలోని విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం సోమవారం రాత్రి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. విగ్రహాల ధ్వంసం గురించి తెలుసుకున్న బిజెపి నాయకులు, హిందూ సంఘాలు పెద్దఎత్తున దేవాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితిలు నెలకొన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలోని రక్షాపురంలో గల భూలక్ష్మి దేవాలయంలోని విగ్రహాల ను సోమవారంన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసారు. పూజా సామాగ్రిని, దేవాలయంలోని ఇతర వస్తువులను చిందరవందర చేశారు. విష యం తెలుసుకున్న స్థానికులు, బిజెపి నాయకులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న వెంటనే సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి కాంతిలాల్ పాటిల్ తమ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. దేవాలయాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఆం దోళన చేస్తున్న వారికి నచ్చచెప్పి నిందితులను ఎట్టి పరిస్థితిలోనైనా పట్టుకుం టామని వదిలేది లేదని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమిం చారు. కాగా విగ్రహాల ధ్వంసం విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం తెలుసుకున్న బిజెపి నేత మాధవిలత మంగళవారం ఉదయం దేవాల యం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో మరోసారి అక్కడ ఉద్రిక్తత నెలకొంది. నిందితులను వెంటనే పట్టుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

**కావాలని చేశారా..లేక దొంగల పనా,,?**

రక్షాపురంలోని అమ్మవారి దేవాలయంలో విగ్రహాలను ఎవరైనా ఉద్దేశ్య పూర్వకంగానే ధ్వంసం చేశారా లేక దొంగల పనా అనేది పోలీసుల విచారణలో తేలనుంది. సిసిటివి పుటేజిల ఆధారంగా పోలీసులు ఇద్దరు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లుగా సమాచారం. కాగా మతిస్థిమితం లేని వ్యక్తే ఈ దురాగతానికి పాల్పడ్డాడని కొందరు పేర్కొంటున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## జీడిమెట్ల సుభాష్‌నగర్‌లో రోడ్డు ప్రమాదం

**- ఒకరు మృతి, మరొకరికి గాయాలు**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు27 ప్రభాతవార్త :** అతివేగంగా అజాగ్రత్తతో నడుపుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహన్ని ఓ టాటాఎసి వ్యాన్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా మరొకరు చావుబతుకుల మధ్య చికిత్స పొందుతునయ్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ సుభాష్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మానిక్యనగర్ లో నివాసముండే ఎం.నాగేందర్‌రెడ్డి తన అల్లుడు వరస అయిన జితేందర్‌రెడ్డితో కలిసి మానిఖ్యనగర్ నుండి తాను పనిచేసే దూలపల్లి పారిశ్రామికవాడకు ఆక్టివా5జిపై ఫైప్‌లైన్‌రోడ్డులో ఉదయం ఎనమిదిన్న సమయంలో వెళుతున్నారు. సుభాష్‌నగర్‌రోడ్లులో వెలుతున్న ఇతేందర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డిలను జీడిమెట్ల నుండి సుభాష్‌నగర్ వైపువెతుతున్న టాటాఎసి డిసిఎం వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీనితో వాహనం నడుపుతున్న నాగేందర్‌రెడ్డి టాటాఎసి డిసిఎం టైర్లక్రిందికి వెళ్లడంతో నాగేందర్‌రెడ్డి, వెనక కూర్చున్న జిత్తేందర్‌రెడ్డి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే 108 వాహనం సహాయంతో జీడిమెట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ నాగేందర్‌రెడ్డి 10.40గంటలకు మృతిచెందాడు.

ఆక్టివా వాహనంవె నక కూర్చున్న అతని ల్లుడు జిత్తేందర్‌రెడ్డితలకు ఎడమచేతికి బలమైన గాయం కావడంతో ఆతడు ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. సమాచారం తెలిసిన వెంటనే జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి టాటాఎసి వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాపు_చేస్తున్నారు.

# ఖాళీగా దర్శనమిస్తున్న జిహెచ్ఎంసి వార్డు ఆఫీసులు

**-సర్కిల్ ఆఫీసులకే పరిమితమవుతున్న అధికారులు -ఫిర్యాదులు తీసుకుంటున్న ఆపరేటర్లు, వాచ్‌మెన్‌లు -ఎప్పుడు వెళ్ళినా సార్లు ఫీల్డులో ఉన్నారంటూ సమాధానం**










**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి పరిధిలో వార్డుపాలన సక్రమంగా సాగట్లేదు. చాలామంది అధికారులు వార్డు ఆఫీసులకే పరిమితం అవుతున్నారు. స్థానిక సమస్యలు చెప్పుకుందామని జనం వార్డు ఆఫీసులకు వెళ్తే ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. చాలాచోట్ల వాచ్‌మెన్‌లు, ఆపరేటర్లు తప్పా అధికారులు ఎవర కనిపించడం లేదు. చేసేదేమీ లేక జనం వారికే ఫిర్యాదు కాపీలు ఇచ్చి వెళ్తున్నారు. ఎప్పుడు వెళ్ళినా అధికారులు ఫీల్డ్‌లో ఉన్నారని సమాధానం చెబుతున్నారు. మధ్యాహ్నం 3నుంచి 5గంటల వరకు తప్పనిసరిగా 10వి భాగాల అధికారులు వార్డు ఆఫీసుల్లో అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ చాలాచోట్ల ఉండటం లేదు. గతేడాది జులైలో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం జిహెచ్ఎంసిలో వార్డు పాలనను తీసుకువచ్చింది. బల్దియా పరిధిలో మొత్తం 150 డివిజన్లు ఉండగా, ఒక్కో చోటన ఒక్కో ఆఫీసును ఏర్పాటు చేసింది. ప్రతి ఆఫీసులో వివిధ విభాగాలకు చెందిన 10మంది అధికారులను నియమించింది. స్థానిక సమస్యలపై ఫిర్యాదు అందింన వెంటనే పరిష్కరించేలా వ్యవస్థను రూపొందించింది. మొదట్లో మంచిగా నడిచిన ఆఫీసులు ఇప్పుడు ఆఫీసర్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఆపరేటర్, వాచ్‌మెన్లు మాత్రమే ఉంటున్నారు.

**విజిటింగ్ అవర్స్‌లోనూ..**

ఒక్కోవార్డు కార్యాలయంలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఇంజనీర్, టౌన్ ప్లానర్, ఎంటమాలజిస్ట్, శానిటరీ జవాన్, అర్బన్ బయోడైవర్సటీ సూపర్ వైజర్, వాటర్‌బోర్డు నుంచి వార్డు నుంచి వార్డు అసిస్టెంట్, విద్యుత్‌వాఖ నుంచి లైన్‌మెన్, కంప్యూటర్ ఆపరేటర్, రిసెప్షనిస్ట్ అందుబాటులో ఉండాలి. వీళ్లంతా స్థానిక సమస్యలపై ఫోకస్ పెట్టాల్సి ఉంటుంది. వార్డు స్థాయి లో వచ్చే తాగునీటి సమస్యలు, సీవరేజ్, శానిటైజేషన్, టౌన్‌ప్లానింగ్ తదితర సమస్యలను సత్వరమే పరిష్కరించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో పరిశీలించి సిటిజన్ చార్ట్ ఆధారంగా నిర్ణిత సమయంలో సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంది. ఉదయం వేళల్లో క్షేత్రస్థా యిలో పర్యటిం చినప్పటికీ, మధ్యాహ్నం 3గంటలనుంచి 5గంటల వరకు తప్పనిసరిగా అందరూ వార్డు ఆఫీసులో ఉండాలి. ఫిర్యాదులు ఎంట్రీచేసి, సంబంధిత అధికారికి ఫార్వర్డ్ చేయాలి. సమస్యను పరిష్కరించాక వెంటనే ఫిర్యాదు దారుడికి తెలియజేయాలి. కానీ చాలామంది ఆఫీసర్లు విజిటింగ్ సమయాల్లో అందుబాటులో ఉండటం లేదు.

**సిటిజన్ చార్ట్ ప్రకారం..**

ఫిర్యాదులు ఎప్పటిలోగా పరిష్కరిస్తారో వివరిస్తూ వార్డు ఆఫీసుల్లో సిటిజన్ ఛార్టర్ ఏర్పాటు చేశారు. చెత్తతరలింపుకు సంబంధిం చి అయితే ఫిర్యాదు అందిన రోజే పరిష్కరించాల్సి ఉంది. పాట్ హోల్స్ పూడ్చేందుకు ,మ్యాన్ హోల్స్ మూతల ఏర్పాటు, రోడ్డు పక్కన పోసిన సిల్ట్ తొలగింపుకు, స్ట్రీట్ లైట్ రిపేర్, యాంటీ లార్వా ఆపరేషన్, జంతువులు మరణించాయని వచ్చే ఫిర్యాదులను 24గంటల్లోపు పరి ష్కంచాల్సి ఉంది. డ్రైనేజీలు బ్లాక్, సీఅండ్ (భవన ని ర్మాణ వ్యర్థాలు)క్లీనింగ్ కోసం 48గంటలు, ఫాగింగ్ ఆపరే షన్ అయితే 24గంటల నుంచి 48గంటల్లో చేయాల్సి ఉం ది. పుట్‌పాత్ రిపేర్లు అయితే 72గంటలు, పెట్ డాగ్స్ లైసెన్స్ కోసం వారం ,సీనియర్ సిటిజన్, దివ్యాంగుల ఐడీకార్డులను 15 రోజు ల్లో ఇవ్వాల్సి ఉంది. పబ్లిక్ టాయిలెట్స్ మెయింటెనెన్స్ అయితే నెల రోజులు, క్లీనింగ్ అయితే అదేరోజు చేయాల్సి ఉంది. కానీ ఈవిధంగా జరగడం లేదు. కొన్ని పనులు చేయకుండానే చేసినట్లు గ్రీవెన్స్ క్లోజ్ చేస్తున్నారు.

## శ్రీకృష్ణపరమాత్మను సాక్షాత్కరించిన శ్రీబాలకృష్ణమ్ నత్యరూపకం

**-ఏపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్**

**రవీంద్రభారతి, ఆగస్టు 26 ప్రభాతవార్త :** ఆలోకయే శ్రీబాలకృష్ణమ్ కూచిపూడి నృత్యరూపకం ద్వారా శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణపరమాత్మను సాక్షాత్కరింపజేసి పరమాత్మపైన ఏకాగ్రతతో కృష్ణభగవానుడికి నీరాజనం అందించేటట్లు చేసిన గురువు పద్మశ్రీ ఉషాగాయత్రికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అభినందనలు తెలిపారు. అధ్యక్షోపన్యాసంలో డా. కె.వి.రమణాచారి ధర్మమనే పదానికి రూపమిస్తే రాముడైతే, భావానికి రూపమిస్తే శ్రీకృష్ణ పరమాత్మని, ఆయన బాల్యం, లీలలు అద్భుతమైతే గీతోపదేశం పరమాద్భుతమని, అలాంటి శ్రీకృష్ణ పరమాత్మను తలచుకోదానికి వీలుగా నారాయణతీర్థుల ఆలోకయే శ్రీబాలకృష్ణమ్ ప్రదర్శించిన నృత్యకిన్నెరకు నమస్సుమాంజలి, గురువు ఉషాగాయత్రి, సంస్థ కార్యదర్శి రఘురామ్‌కు అభినందనలు తెలిపారు. శ్రీకృష్ణాష్టమి, సంస్థ నాలుగవదశక వేడుకల్ని పురస్కరించుకొని రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నృత్యకిన్నెర ఆధ్వర్యంలో డా. మద్దాళి ఉషాగాయత్రి నృత్యదర్శకత్వంలో శ్రీబాలకృష్ణుని బాల్యం, లీలలను శిష్యులు 30మందిచే ప్రదర్శింపబడిన ఆలోకయే శ్రీ బాలకృష్ణమ్ కూచిపూడి నృత్యరూపకం గణేశుడిని పూజించే తరంగం జయజయ స్వామితో ప్రారంభమై, శ్రీకృష్ణలీలా తరంగిణి నుండి తారాగములు, పద్యాలు, గద్యాలను తీసుకుని కృష్ణుని జీవితంలోని తరంగములను కలుపుతూ అల్లిన శ్రీమహావిష్ణువు తరంగం శరణంభవతో రాక్షసుల అకృత్యాలను భరించలేక భూదేవి కోరికపై శ్రీకృష్ణుని అవతారం ఎత్తినట్లు చిత్రీకరించి, తర్వాత కృష్ణుని బాల్యాన్ని పాడుతూ కళ్లకుకట్టారు. చిన్ని కృష్ణుడు గోపికలు, నందయశోద పాల్గొన్న బాలగోపాల కృష్ణ పాహిపాహి, నీలమేఘ శరీర, కాలయ యశోద తదితర ఆటపాటల కృష్ణలీలా తరంగిణి సంఘటనలు; కృష్ణుడు మట్టినితిని గోపికలను ఆటపట్టించడం, వెన్న దొంగిలించడం; కృష్ణుడు కాలేయమధనం కాళీయనర్తనం; గోవర్ధనగిరి ఎత్తడం ద్వారా ఆవులు ఎలా రక్షించబడ్డాయో వర్ణించడం; చివరిగా శ్రీకృష్ణుడికి రుక్మిణీ కళ్యాణంతో ముగిసిన ఆలోకయే శ్రీబాలకృష్ణమ్ నృత్యరూపక ప్రదర్శన బృందావనాన్ని తలపిస్తూ అశేషప్రేక్షకులను మైమరపించింది.


ఆలోకయే శ్రీబాలకృష్ణమ్ కూచిపూడి నృత్యరూపకంలో దృశ్యాలు

## మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ముఠా అరెస్టు..

**-60కిలోల గంజాయి, రూ. 1500 నగదు, కారుతో పాటు 3సెల్‌ఫోన్లు స్వాధీనం..**

**-రాచకొండ పోలిస్ కమిషనర్ సుధీర్ బాబు**


వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ పోలిస్ కమీషనర్ సుధీర్ బాబు.

**నేరెడ్‌మెట్, ఆగస్టు27 ప్రభాతవార్త:** రవాణా వ్యాపారంలో నష్టం రావడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే నెపంతో అక్రమంగా మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న ఇద్దరిని ఎస్వోటి మహేశ్వ రం, ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేసినట్లు రాచకొండ పోలిస్ కమీషనర్ సుధీర్ బాబు. మంగళవారం నేరెడ్‌మెట్ వాయుపురిలోని రాచకొండ పోలిస్ కమీష నరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర మలగావ్, నాషిక్ ప్రాంతానికి చెందిన వాల్మిక్ రూపా మొహితే అలియస్ వాల్మిక్ (53) ట్రాన్స్‌పోర్ట్ వ్యాపా రం, అదే రాష్ట్రానికి చెందిన భట్టు దేవరామ్ చౌహాన్ (39)లు ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేసేవారు. గత కొంత కాలంగా వారికి నష్టం రావడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో తమ వద్ద ఉన్న ట్రాన్స్ పోర్ట్ వాహనాన్ని అమ్మి షిఫ్ట కార్డును కొనుగోలు చేసా రు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తిరుపతి అనే వ్యక్తి ద్వారా గంజాయి విక్రయించే స్థలాలను తెలుసుకొని అక్కడి నుండి పెందుర్తి మీదుగా విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో సుమారు 60కిలోల గంజాయిని కొనుగోలు చేసి ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలని అనుకున్నారు. ఇదే క్రమంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్వోటి మహేశ్వరం, ఇబ్రహీంపట్నం పోలీసులు రాయిపోల్ వద్దకు రాగానే వారిని తనఖీ చేయగా వారి కారులో 60కిలోల గంజాయి ఉండడంతో వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారి వద్ద నుండి 60కిలోల గంజాయి, రూ. 1500 నగదు, కారుతో పాటు 3సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎంతో చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసు అధికారులను కమీషనర్ సుధీర్ బాబు అభినందించారు.

## గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎంపిడివో



గురుకుల పాఠశాల రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడివో నరేందర్ రెడ్డి

**యాచారం ఆగస్టు27,ప్రభాతవార్త :** యాచారం మండలంలో గల శంషాబాద్ గురుకుల పాఠశాలను ఎంపిడివో నరేందర్ రెడ్డి మంగళవారం ఆకస్మిక పర్యటించి రికార్డులను తనిఖీ చేశారు. హాస్టల్ వసతులు సౌకర్యాలను తదితర అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.పాఠశాల భవనంలో పరిశుభ్రత తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు.భోజనం వసతిపై ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.నాణ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు.మెరుగైన విద్యను అందిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి వసతులు కల్పించాలని సూచన చేశారు.

## ఓంకారేశ్వర ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



**యాచారం ఆగస్టు27,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో ఓంకారేశ్వర ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు సందర్భంగా శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవస్థానం నందు రాధా రుక్మిణి సమేత శ్రీ వేణుగోపాల స్వామి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.స్వామివారికి ప్రత్యేక అభిషేకం అష్టోత్తర శతనామావళి అఖండ హారతి డోలారోహణం తొట్టెల కార్యక్రమం తిలకించి స్వామివారి యొక్క తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి యొక్క అనుగ్రహం పొందిన గ్రామస్తులు భక్తజన బృందం వారిచే స్వామివారికి జోలపాడుతూ పవళింపు సేవ చేసి తరించారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**తాండూరు టౌన్ ఆగస్టు27,ప్రభాతవార్త :** తాండూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి రోజు అల్పాహారం అందిస్తూ 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహన్ రెడ్డి పాల్గొని అల్పాహారం అందించారు.అనంతరం ప్రతి రోజు రోగులకు అల్పాహారం అందిస్తున్న నజీర్‌ని అభినందించారు.అనంతరం నగరేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో ప్రగతి దారులు

**-ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన మాజీ సర్పంచ్ జెటావత్ రాజు నాయక్**



ధన్‌సింగ్ తండా హెచ్‌బిఎల్ పరిశ్రమ ముందు చక చక సాగుతున్న సిసి రోడ్డు పనులు

**నందిగామ ఆగస్టు27,ప్రభాతవార్త :**

పారిశ్రామిక అభివృద్ధి ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమన్న ప్రధాన లక్ష్యంతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశ్రమలకు రహదారులు కల్పించడంలో సఫలీకృతులయ్యారు.ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్న పరిశ్రమ నిర్వాహకులు ఎట్టకేలకు రహదారి నిర్మాణంలో వారి సమస్యలు దూరం కానున్నాయి. ఈ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే చుట్టుపక్కల ఉన్న రైతులతో,వెంచర్ నిర్వాహకులతో చర్చించి రహదారి పనులకు శ్రీకారం చుట్టారు.గతంలో సిడి తండా మాజీ సర్పంచ్ రాజు నాయక్ రహదారి నిర్మాణం కోసం గ్రామపంచాయతీలో తీర్మానం సైతం పెట్టారు.స్మశాన వాటికకు వాహనాల్లో శవయాత్ర ద్వారా తీసుకురావాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అస్తవ్యస్తమైన బురదతో ,ఇరుకు రహదారితో వాహనదారులు,బాటసారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు అప్పట్లో సర్పంచ్ పలుమార్లు అధికారుల,ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చిన సందర్భాలు ఉన్నాయి.రహదారుల నిర్మాణంతో రైతులు,పరిశ్రమలు, తండా వాసులకు,స్మశాన వాటికకు వచ్చే వారికి మేలు జరుగుతుందన్నారు.రహదారి నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మాజీ సర్పంచ్ రాజు నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆనందోత్సవాల మధ్య శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు..

**కొందుర్గు, ఆగస్టు 26, (ప్రభాతవార్త) :**

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సాయంత్రం స్థానిక లక్ష్మీ నరసింహ్మా స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా ఊట్లు కొట్టే కార్యక్రమాని ఏర్పాటు చేయగా యువకులు, పిల్లలు ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి జంగం రాజేష్ కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్‌శర్మ, దేవాలయ ఛైర్మన్ చేవేళ్ల కృష్ణయ్య, సభ్యులు చెన్న నర్సింలు, సీలం వేణుగోపాల్, జెగ్గ మొల్ల బాల్‌రాజ్, వివిధ పార్టీల నాయకులు రాజేష్ పటేల్, కమ్మరి యాదయ్య, కోమరబండ శ్రీశైలం, జీబీ కృష్ణగుంటి నరేందర్, సంజీవరెడ్డి, మాణయ్య నర్సింలుగౌడ్ పాల్గొన్నారు.

## ఎన్ఎన్ఆర్ ఫార్మసీ ప్రొఫెసర్ రాజశేఖర్‌కు జెఎన్‌టియుహెచ్ డాక్టరేట్

**ఘట్‌కేసర్, ఆగష్టు 27, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలోని నల్ల నర్సింహ్మారెడ్డి కళాశాల ఫార్మసీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రాజశేఖర్‌కు జెఎన్‌టియుహెచ్ నుంచి డాక్టరేట్ లభించింది. నల్ల నర్సింహ్మారెడ్డి సమీకృత విద్యాసంస్థ ఔషధ విభాగం సహాయ ప్రొఫెసర్ ఎస్.రాజశేఖర్‌కు హైదరాబాద్ జెఎన్‌టియు అధికారులు డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసినట్లుగా కళాశాల డైరక్టర్ డాక్టర్ సీవి.క్రిష్ణారెడ్డి తెలిపారు. తన పరిశోధనలో భాగంగా 'ఫార్ములేషన్-కారెక్టరైజేషన్ ఆఫ్ డ్రైడ్ నానోసస్పెన్సన్స్ ఆఫ్ పూర్లీ వాటర్ సొలుబ్ డ్రగ్స్' అనే అంశంపై ఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ పి.విజయలక్ష్మి పర్యవేక్షణలో ఈపరిశోధనకు జెఎన్‌టియుహెచ్ వారు డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, డైరక్టర్‌తో పాటు ఫార్మసీ విభాగాధిపతి ప్రొఫెసర్ కృష్ణమోహన్ చిన్నాల, అధ్యాపకులు రాజశేఖర్‌ను అభినందించారు.

# ఆటో కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

**-ఐటీసీ హాస్టల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి**




ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం తొలగించాలని కోరుతూ పోచారం ఇన్ఫోసిస్ కంపెనీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ సభ్యులు.

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 27, ప్రభాతవార్త:**
ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం తొలగించాలని కోరుతూ ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. పోచారం మున్సిపల్ ఇన్ఫోసిస్ కార్యాలయం వద్ద ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళ వారం ఐటీ కంపెనీ చర్యల వల్ల వందలాది మంది హాస్టల్, హోటల్, ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నామని వెంటనే ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం తొలగించి వర్క్ ఫ్రం ఆఫీస్ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ 2020 ఏప్రిల్ 2024 ఆగస్టు వరకు ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం కొనసాగుతుందని అన్నారు. కొవిడ్ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు ఐటీ ఉద్యోగుల కొరకు ఇబ్బంది కలుగకుండా హాస్టల్స్, హోటళ్లు నిర్వహించామని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఐటీ ఉద్యోగులు ఇక్కడకు విచ్చేసి ఉద్యోగం చేస్తుండటంతో కొవిడ్ సమయంలో వారికి ఇబ్బంది కలుగకుండా తమ వంతు సహాయసహకారాలు అందించామని అన్నారు. దాదాపు గత నాలుగేళ్లుగా ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం కొనసాగుతుండటంతో కంపెనీ సమీపంలో వెలిసిన హాస్టళ్లు, హోటళ్లు, ఆటో కార్మికులకు ఉపాధి కరువైందని అన్నారు. దీంతో ఎంతో మంది హోటళ్లల్లో పనిచేసే కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇకనైనా ఇన్ఫోసిస్ యాజమాన్యం ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం ఆఫీస్ కల్పించినట్లయితే ఎన్నో విధాలుగా అన్ని రంగాల వారికి ఉపాధి కల్పించినవారౌతారని అన్నారు. దయచేసి తమ విజ్ఞప్తిని స్వీకరించాలని కోరుతూ కంపెనీ రోడ్డు గుండా ప్లే కార్డులు చేతబూని ర్యాలీ నిర్వహించారు. తమ సమస్య పరిష్కరం కొరకు ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఐటీ అధికారులను కలిసి సమస్యను వివరిస్తామని అన్నారు. తమ సమస్య పరిష్కరం అయ్యేంతవరకు దశల వారిగా ఆందోళనలు కొనసాగిస్తామని ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి మహీధర్, హాస్టల్ భవన యాజమానులు సుధీర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపేందర్, రాంరెడ్డి, శ్రీకాంత్, వేణు, ఆర్‌కె. వర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యూపిఎస్‌సి సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలో సత్తాచాటిన జయకృష్ణ



సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న జయకృష్ణ

**మహేశ్వరం, ఆగస్టు 27, ప్రభాతవార్త :** 2024 సంవత్సరానికి యూపిఎస్‌సి సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గ్రామీణ యువతకు మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ యువకుడు గడ్డమీది జయకృష్ణ ఆదర్శంగా నిలిచాడు. భారతదేశం మొత్తం నుండి పదమూడు లక్షల నలభై వేల మంది యుపిఎస్‌సీ పరీక్షలు రాయగా అందులో కేవలం 14,625 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. మన తెలంగాణ రాష్ట్రం నుండి కేవలం వందల మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. జయకృష్ణ తల్లిదండ్రులు నిరక్ష్యరాస్యులు, రోజు కూలీ పని చేసుకుని జీవనం కొనసాగించే పేద కుటుంబంలో పుట్టిన జయకృష్ణ కష్టపడి చదువుతూ, పట్టుదలతో ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. తెలంగాణ రాష్ట్రం నుండి యుపిఎస్‌సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మెయిన్ ఎగ్జామ్ ప్రిపరేషన్ కోసం ప్రోత్సాహకంగా ఉండేలా తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి సంస్థ ఒక సామాజిక బాధ్యతగా ఆర్థిక సహాయం చేయడం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పేరుతో లక్ష రూపాయల చెక్కులను విజేతలకు అందజేయడం జరిగింది. తుమ్మలూరు వాసి జయకృష్ణ కూడా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా లక్ష రూపాయల చెక్కుని అందుకున్నారు.

### సామాజిక సేవలో జయకృష్ణ...

తుమ్మలూరు గ్రామంలోని విద్యార్థులు, యువత బాగా చదివి ఉన్నత స్థానాలకి ఎదగాలని, గ్రామ యువకుడు కటికెల యాదగిరి చేస్తున్న వివిధ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, విద్యార్థులను ప్రోత్సహించడంలో ముందుడి సహకరిస్తూ తన జ్ఞానాన్ని విద్యార్థులతో పంచుకుంటున్నట్లు తెలిపారు. జయకృష్ణ ఐఎఎస్ అధికారి కావడానికి ఇంకా ఒక్క అడుగు దూరంలో ఉన్నాడని, యుపిఎస్‌సీ ఫైనల్ ఎగ్జామ్‌లో కూడా ఉత్తీర్ణ సాధించి తుమ్మలూరు గ్రామ నుంచి మొట్టమొదటి కలెక్టర్‌గా అవుతాడని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు భగవంతుని ఆశీస్సులతో పాటు గ్రామస్థుల ఆశీస్సులు జయకృష్ణపై ఉంటాయని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు కటికెల యాదగిరి, రాజమోని శ్రీశైలం, లింగారెడ్డి, చోటు, కార్తీక్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శేరిల మైసమ్మ బోనాల ఉత్సవాలు

**కొందుర్గు, ఆగస్టు 26, (ప్రభాతవార్త) :**
మండల కేంద్రంలోని గ్రామ దేవత అయిన శేరిల మైసమ్మ తల్లికి అంగరంగ వైభవంగా బోనాలు, ఉత్సవాలను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏటా శ్రావణ మాసం చివరి సోమవారం నాడు మండల కేంద్రంలోని షాద్‌నగర్ రోడ్డు ప్రక్కన వెలిసిన శేరిల మైసమ్మ దేవతకు ఎడ్ల బండ్లను తిప్పి బోనాలను నిర్వహిస్తారు. బోనాలను పురస్కరించుకొని దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ ద్వీపాలు, పచ్చన తోరణాలతో పూల దండలతో అలంకరించారు. అంతేగాకుండా భక్తి గీతాలను మండల కేంద్రంలో మైకుల ద్వారా వినిపించారు. ఉదయం నుంచే భక్తులు తమ తమ వాహనాలలో వచ్చి పూజలు చేయించారు. సాయంత్రం అలంకరించిన ఎడ్ల బండ్లను ప్రదక్షణ చేయించారు. అనంతరం తెలంగాణ తల్లి బోనం ముందు రాగా వెంటనే బోనాల సముదాయం దేవాలయానికి చేరుకొని ప్రదక్షణలు చేసి బోనం సమర్పించి మహిళలు మొక్కుబడిని తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపు ముందు యువకులు నృత్యాలు చేస్తూ సంబరాలను పంచుకున్నారు. ఈ సంబరాల్లో మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, మాజీ ఎంపీటీసీ కావలి యాదయ్య, బీజేపీ నాయకులు ఇసారి సత్యనారాయణతో పాటు యువ నాయకులు గుంటి నరేందర్ మొద్సు యాదగిరి, మల్లేష్, సీలం లింగంతో పాటు మహిళలు, గ్రామస్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఊరేగింపుగా తరలి వెలుడుతున్న శేరిల మైసమ్మ బోనాలు.

## స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ, గోపికల వేషాధారణలో చిన్నారులు

**షాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :**
శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడలో శ్రీచైతన్య హై స్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే శ్రీకృష్ణుడు, గోపికల వేషాదరణ వేయించి గ్రామంలో కోలాటాలు ఆడుతూ, కీర్తనలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. గ్రామ కూడలిలో ఉట్టి ఏర్పాటు చేసి, శ్రీకృష్ణ వేషాధారణ ఉన్న విద్యార్థులచే పగలగొట్టించారు. ఈకార్యక్రమం గ్రామస్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు,పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

## బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా శ్రీరాములు



నియామక పత్ర ం అందుకుంటున్న శ్రీరాములు

**ఘట్‌కేసర్, ఆగస్టు 27, ప్రభాతవార్త:**
బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా ఎదుగని శ్రీరాములు నియమితులయ్యారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌కు చెందిన శ్రీరాములు ఓబీసీ మోర్చ జిల్లా కార్యవర్గంలో చురుకుగా పని చేయడంతో ఆయనకు రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించినట్లు తెలిపారు. ఈమేరకు ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్‌గౌడ్, ప్రధానకార్యదర్శి నందనం దివాకర్, ఈశ్వరప్ప, ఉపాధ్యక్షులు సదానంద, కార్యదర్శి గుండ్ల అంజనేయులుగౌడ్‌ల ఆధ్వర్యంలో శ్రీరాములు భాధ్యతలు స్వీకరించారు. తనకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పదవి ఇవ్వడానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, జాతీయ ఓబీసీ మోర్చ అధ్యక్షులు కె.లక్ష్మణ్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ జిల్లా అధ ్యక్షులు విక్రమ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సంజయ్, గొంగళ్ల మహేశ్, కాలేరు రామోజీ, బొడ్డు రవిలకు శ్రీరాములు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కూచిపూడి నాట్య ప్రదర్శనలో మోక్షధృతికి అవార్డు



దైవజ్ఞశర్మ నుంచి అవార్డు అందుకుంటున్న మోక్షధృతి

**ఘట్‌కేసర్, ఆగష్టు 27, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన మోక్షధృతికి ఉత్తమ నాట్యకళాకారిణి అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో జరిగిన శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. మోక్షధృతి పాల్గొని అత్యుత్తమ నాట్య ప్రదర్శన చేయగా జ్యోతిష్యుడు దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకుంది. నృత్యరంగంలో బాలికలు రాణించడం ద్వారా భారతీయ నృత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేలా ప్రదర్శనలు ఉండాలని ఆయన అన్నారు. లహరి నృత్య నికేతన్ ఛైర్‌పర్సన్, నాట్యగురువు డాక్టర్ పి.ఝాన్సీరామ్ మాట్లాడుతూ సాంస్కృతిక రంగాల్లో రాణించిన ప్రతిఒక్కరికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కూచిపూడి నాగ్య ప్రదర్శనలో మోక్షదృతి అత్యుత్తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించినట్లు ఆమె తెలిపారు.

**డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయస్థాయి అవార్డుకు రాజు ఎంపిక**

**పూడూరు, ఆగష్టు 27, ప్రభాతవార్త :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయ స్థాయి అవార్డుకు పూడూరు మండలం కడ్మూరు గ్రామానికి చెందిన, వికారాబాద్ జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్యాగరి రాజును జాతీయ అవార్డు సెలెక్షన్ కమటీ ప్రకటించింది.ఈ మేరకు జాతీయ అవార్డు సెలెక్షన్ కమటీ నేషనల్ ఛైర్మన్,బిఎస్ఎ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఆహ్వాన పత్రాన్ని రాజుకు హైద్రాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా అవార్డు సెలెక్షన్‌కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ ఎస్,ఎస్‌టి, బిసి, మైనార్టీల సాహిత్యం అభివృద్ధి చేసేందుకు కృషిచేసే ఉధ్యమకారులు. సంఘసేవకులు,రచయితలు,కవులు,కళాకారులు,స్వచ్ఛంద సంస్థలకు ప్రతి సంవత్సరం ఈ అవార్డును అందజేయనున్నట్లు వివరించారు. 2024 సంవత్సరానికిగాను రాజును ఎంపిక చేసినట్లు,సెప్టెంబర్ 5వ తేదీన అంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 8వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అవార్డులను ప్రధానం చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయస్థాయి అవార్డు గ్రహిత బ్యాగరి రాజు మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేసినందుకు సెలెక్షన్ కమిటీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో బిఎస్ఎ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎం గౌతం,కో ఆర్డినేటర్,హనుమాండ్లు పాల్గొన్నారు.

## రైతునేస్తంలో వరిపంటపై అవగాహన



పూడూరు రైతువేదికలో జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు,నాయకులు,రైతులు తదితరులు

**పూడూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త :** అర్హులు అందరికి పంటరుణాలు మాఫీ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని పిఎసిఎస్ ఛైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి అధికారులకు సూచించారు.మంగళవారం పూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసిందని,రుణాలు మాఫీ కాని రైతులకోసం ప్రభుత్వ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా వరిపంట సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు వివరించారు.ఈ రార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి,డివిజన్ అధికారి లక్ష్మీకుమారి,ఏఓ తులసీరాం,మాజీ ఎంపిటిసిలు సురేందర్, లక్ష్మణ్, రైతులు వెంకట్‌రెడ్డి,లింగప్ప,యాదగిరిగౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

**-మాజీ ఎంపిపి పిన్నింటి మధుసూదన్‌రెడ్డి**



మొక్కలు నాటుతున్న మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి

**కొత్తూర్, ఆగస్టు 27, ప్రభాతవార్త :**
కొత్తూర్ మండలం ఎస్‌బిపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా హరితహారం మొక్కల పంపిణీ కార్యక్రమం మంగళవారం తాజా మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాజా మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. మొక్కల దాతలు ప్రభోద సేవ సమితి సభ్యులు మన్నె మల్లేష్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామ ప్రజలు మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామ ప్రజలు మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో విలేజ్ సెక్రటరీ, ప్రధానోపాధ్యాయులు, మాజీ సర్పంచ్ రవినాయక్, మాజీ వార్డు సభ్యులు సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం, కోఆప్షన్ సభ్యులు సురేష్‌గౌడ్, యాదయ్య, ఎమ్మె వెంకటయ్య, అంబటి శేఖర్, ఎమ్మె శ్రీశైలం, అంబటి విష్ణు, అంబటి శ్రీశైలం, లక్ష్మారెడ్డి, అంబటి నందు, రాము, మహేష్, అంబటి వెంకటేశ్, లింగం, నరసింహారెడ్డి, జయేందర్‌రెడ్డి, దయానందరెడ్డి, బోకుల రాజు, రాములుగౌడ్, శ్రీశైలం, రవినాయక్, నవీన్, రవి, వంశీ, మధు, బన్నీ, విజయ్, గ్రామస్థులు ఉన్నారు.

## శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి



వినాయక ఉత్సవ కమిటి నాయకులతో మాట్లాడుతున్న ఇన్స్‌పెక్టర్ శివప్రసాద్

**కడ్తాల్,ఆగస్టు 27 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఇన్స్‌పెక్టర్ శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినాయక మండపాలు రోడ్డుకు దూరంగా వేసుకోవాలని రోడ్డులో వేస్తే వాహనాలకు ఇబ్బంది ఏర్పడుతుందని ఆయన సూచించారు. వినాయక నిమజ్జనం అయ్యే వరకు ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిని అరెస్టు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈసారి డిజె పర్మిషన్ లేదని ఎవరైనా డిజె యజమానులు డిజె పెడితే వారికి జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుందని ఆయన తెలిపారు. సమావేశానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటి సభ్యులు, యువకులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు హాజరయ్యారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**షాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :**
సీజనల్ వ్యాధులు, కురుస్తున్న వర్షాలకు హాస్టల్ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో అపర్ణ అన్నారు. మంగళవారం హైతాబాద్, షాబాద్‌లోని హాస్టళ్లను విజిట్ చేసి వాటర్ ట్యాంక్, హాస్టల్ పరిసరాలు, కిచన్ షెడ్,స్టాక్ రిజిస్టార్‌లను చూశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డె న్లు స్వప్న, జ్యోతి, శేఖర్ తదితరులు ఉన్నారు.



బియ్యం స్టాక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

## రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి



రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించాలని వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

**ఘట్‌కేసర్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో రైల్వేవంతెన నిర్మాణం కారణంగా రహదారి మూసివేయడంతో ప్రత్యామ్నాయంగా రోడ్డు వేసి ప్రయాణికుల సమస్యను తీర్చేందుకు కోటి 75 లక్షల రుపాయల నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యాయాదవ్ టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వేగేటు మూసి వేయడంతో రహదారిపై గేటు అవతల ఉన్న కాలనీ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని నారాయణ గార్డెన్ నుంచి వెంచర్ ద్వారా ఎదులాబాద్ రోడ్డు వియూపి వరకు రోడ్డు వేసేందుకు రూ.1.75 కోట్లు అవసరమవుతాయని తెలియజేయగా జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించి రెండు కోట్ల రుపాయలు మంజూరు చేయిస్తామని వజ్రేశ్‌యాదవ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిళ్ల ముత్యాలుయాదవ్, కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, మున్సిపల్ ఏఈ రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిల్కూరి మచ్చేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు, డీసీసీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మాజీ వార్డుసభ్యులు సల్లూరి నర్సింగ్‌రావు, నాయకులు ఎండి.సిరాజుద్దిన్ పాల్గొన్నారు.